సాక్షి కర్నూలు

సోమవారం ; 27 ; జనవరి ; 2025



శ్రీగిరి కిటకిట

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల భ్రమరాంబా మల్లికార్జున స్వామి దర్శనానికి ఆదివారం భక్తులు పోటెత్తారు. భక్తులు పాతాళగంగలో పుణ్యస్నానాలు ఆచరించి స్వామిఅమ్మవార్లను దర్శించుకున్నారు.



మహానందిలో భక్తుల సందడి

మహానంది: సెలవురోజు కావడంతో ఆదివారం మహానందిలో భక్తుల సందడి నెలకొంది. కోనేరుల్లో భక్తులు పుణ్యస్నానాలు ఆచరించి శ్రీ కామేశ్వరీదేవి, మహానందీశ్వరస్వామిని దర్శించుకున్నారు.



భ్రామరీకి ఊయలసేవ

శ్రీశైలంటెంపుల్: భ్రమరాంబాదేవికి దేవస్థాన అర్చకులు ఊయలసేవ నిర్వహించారు. ఆదివారం అమ్మవారి మూల నక్షత్రాన్ని పురస్కరించుకుని అమ్మవారికి సహస్రనామ పూజలు చేపట్టారు.

న్యూస్‌రీల్

శ్రీ మఠంలో వైభవంగా ద్వాదశి వేడుకలు



ప్రత్యేక అలంకరణలో మూల బృందావనం

మంత్రాలయం: శ్రీ రాఘవేంద్ర స్వామి మఠంలో ఆదివారం ద్వాదశి వేడుకలను వైభవంగా నిర్వహించారు. స్వామి వారిని దర్శించుకునేందుకు దేశం నలుమూలల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలిరావడంతో మంత్రాలయంకు భక్తుల రద్దీ కొనసాగుతుంది. ముందుగా తుంగభద్ర నదిలో పుణ్యస్నానాలు ఆచరించి గ్రామ దేవత మంచాలమ్మ, శ్రీరాఘవేంద్రస్వామి మూల బృందావనానికి ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు తీర్చుకున్నారు. తెల్లవారుజాము నుంచి పీఠాధిపతి శ్రీ సుభుదేంద్రతీర్థుల ఆధ్వర్యంలో మూలబృందావనానికి నిర్మల్య విసర్జన, ఫల, పుష్ప, క్షీరాభిషేకం నిర్వహించి ప్రత్యేక పుష్పాలతో అలంకరించారు. సాయంత్రం ఉత్సవమూర్తి ప్రహ్లాదరాయులను చెక్క, వెండి, బంగారు, నవరత్న రథోత్సవాలపై కొలువుంచి శ్రీ మఠం మాడ వీధుల్లో ఊరేగించారు. భక్తులు అధిక సంఖ్యలో తరలిరావడంతో శ్రీ మఠం పరిసరాలు రద్దీగా మారాయి.

కర్నూలు విద్యుత్ సర్కిల్‌కు ఉత్తమ అవార్డు



సీఎండీ చేతుల మీదుగా మెమొంటో అందుకుంటున్న ఎస్‌ఈ ఉమాపతి

కర్నూలు న్యూసిటీ: కర్నూలు విద్యుత్ సర్కిల్‌కు ఉత్తమ అవార్డు దక్కింది. ఏపీఎస్‌పీడీసీఎల్ పరిధిలోని మొత్తం 9 సర్కిళ్లలో కర్నూలు అన్ని పారామీటర్లలో మొదటి స్థానంలో నిలవడంతో ఉత్తమ సర్కిల్‌గా ఎంపికైంది. ఈ మేరకు తిరుపతిలో ఆదివారం నిర్వహించిన గణతంత్ర వేడుకల సందర్భంగా సీఎండీ చేతు ల మీదుగా కర్నూలు ఎస్‌ఈ ఉమాపతి మెమొంటో అందుకున్నారు. ఈ సందర్భంగా ఎస్‌ఈ మాట్లాడుతూ... తమ సర్కిల్ పరిధిలోని అధికారులు, ఉద్యోగులు, సిబ్బంది సమన్వయంతో విద్యుత్ వినియోగదారులకు మెరుగైన సేవలు అందించడంతో ఈ అవార్డు దక్కిందన్నారు.

శ్రీశైల దేవస్థానానికి రూ.2 లక్షల విరాళం

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల దేవస్థానం నిర్వహిస్తున్న పలు పథకాలకు పలువురు భక్తులు రూ.2లక్షల విరాళాలను అందించారు. ఆదివారం శాశ్వత అన్నప్రసాద వితరణ పథకానికి హైదరాబాద్‌కు చెందిన నందిగం రంజిత్‌కుమార్ రూ.1,01,100 విరాళాన్ని ఏఈవో స్వాములకు అందజేశారు. అలాగే రాజమండ్రికి చెందిన ఎస్.సూర్యప్రకాశ రావు ప్రాణదాన ట్రస్ట్‌కు రూ.1,00,116 విరాళాన్ని పర్యవేక్షకులు టీ.హిమబిందుకు అందజేశారు. విరాళాలు అందించిన దాతలను దేవస్థానం తరుపున స్వామివారి శేషవస్త్రాన్ని, లడ్డూప్రసాదాలను, జ్ఞాపికను అందజేసి సత్కరించారు.

నేడు ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక రద్దు

కర్నూలు (టౌన్): పోలీసు కానిస్టేబుళ్ల దేహదారుఢ్య సామర్థ్య పరీక్షల నేపథ్యంలో సోమ వారం కర్నూలు రెండవ పట్టణ పోలీస్‌స్టేషన్ పక్కనున్న క్యాంప్ కార్యాలయంలో నిర్వహించాల్సిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని రద్దు చేసినట్లు జిల్లా ఇన్‌చార్జ్ ఎస్పీ ఆదిరాజ్ సింగ్ రాణా ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. అర్జీదారులు ఈ విషయాన్ని గమనించాలన్నారు.

వందశాతం ఉత్తీర్ణత సాధించాలి



విద్యార్థినికి వీల్‌చైర్ అందజేస్తున్న దృశ్యం

కృష్ణగిరి: ఈ ఏడాది పదో తరగతిలో వంద శాతం ఉత్తీర్ణత సాధించేందుకు ఉపాధ్యాయులు కృషి చేయాలని డీఈఓ శామ్యూల్‌పాల్ అన్నారు. స్థానిక కస్తూర్బా విద్యాలయాలన్ని ఆదివారం సాయంత్రం ఆయన పరిశీలించారు. విద్యార్థులకు పదో తరగతి మంచి పునాది అని కష్టపడి చదువుకుని మంచి మార్కులు అనంతరం ఎంఈఓ-1 సునంద విరాళంగా ఇచ్చిన వీల్‌చైర్‌ను బాపనదొడ్డి గ్రామానికి చెందిన కండరాల వ్యాధితో బాధపడుతున్న పావనికి డీఈఓ చేతుల మీదుగా అందజేశారు. ఈ సందర్భంగా డీఈఓ మాట్లాడుతూ విద్యార్థి దశ నుంచే విద్యార్థులు సేవా గుణం అలవర్చుకోవాలన్నారు. కార్యక్రమంలో ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ శివమ్మ తదితరులు పాల్గొన్నారు.

జిల్లా సమగ్రాభివృద్ధికి కృషి

- ప్రజల తలసరి ఆదాయం పెంచేందుకు విజన్ ప్లాన్
- గణతంత్ర దినోత్సవంలో జిల్లా కలెక్టర్ పి.రంజిత్‌బాషా
- స్వాతంత్ర్య సమరయోధుల కుటుంబాలకు సన్మానం
- ఉత్తమ సేవలందించిన అధికారులకు ప్రశంసాపత్రాల ప్రదానం
- ఆకట్టుకున్న విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు



రిపబ్లిక్ డే వేడుకల సందర్భంగా పరేడ్ గ్రౌండ్‌లో ప్రసంగిస్తున్న కలెక్టర్ రంజిత్ బాషా



పరేడ్ గ్రౌండ్‌లో జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి సెల్యూట్ చేస్తున్న కలెక్టర్ రంజిత్ బాషా, ఇన్‌చార్జి ఎస్పీ హుసేన్ పీరా, జేసీ నవ్య తదితరులు



పరేడ్ గ్రౌండ్‌లో కవాతు నిర్వహిస్తున్న పోలీసులు



ఝాన్సీ లక్ష్మీబాయిగా..

కర్నూలు(సెంట్రల్): ప్రజలందరి సహకారంతో జిల్లా సమగ్రాభివృద్ధికి విశేష కృషి చేస్తున్నట్లు జిల్లా కలెక్టర్ పి.రంజిత్‌బాషా తెలిపారు. జిల్లాను పారిశ్రామికంగా అభివృద్ధి చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామని వివరించారు. పోలీసు పరేడ్ గ్రౌండ్‌లో గణతంత్ర దినోత్సవాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. ముందుగా జాతీయ పతాకాన్ని జిల్లా కలెక్టర్ ఆవిష్కరించారు. అనంతరం సాయుధ దళాల నుంచి గౌరవ వందనం స్వీకరించారు. జిల్లాలోని వివిధ హోదాల్లో పనిచేస్తున్న 400 మంది ఉద్యోగులకు ప్రశంసాపత్రాలను అందించారు.

వేగంగా అభివృద్ధి పనులు

జిల్లాలో వ్యవసాయం, పరిశ్రమలు, సేవారంగాల్లో స్థూల ఉత్పత్తి విలువ 2022–23లో రూ.47,514 కోట్లుగా నమోదు కాగా.. 2028–29లో 1,07,782 కోట్లకు తీసుకెళ్లాలన్న లక్ష్యంతో పనిచేస్తున్నట్లు జిల్లా కలెక్టర్ పి.రంజిత్‌బాషా తెలిపారు. 2022–23లో ప్రజల తలసరి ఆదాయం రూ. 1,74,932 ఉండగా 2028–29లో 3,90,411లకు పెంచేందుకు విజన్ ప్లాన్‌ను రూపొందించినట్లు చెప్పారు. ఓర్వకల్లు ఇండస్ట్రియల్ హబ్‌లో మొదటి దశలో 2,651.15 ఎకరాలు, రెండో దశలో 2,121.19 ఎకరాల్లో పారిశ్రామిక వాడలను అభివృద్ధి చేస్తున్నట్లు తెలిపారు. అలాగే 300 ఎకరాల్లో డ్రోన్ పరిశ్రమ, 1,200 ఎకరాల్లో ఎల్రక్టానిక్ వెహికల్ పార్కు, 150 ఎకరాల్లో సెమీ కండక్టర్ ఇండస్ట్రీలను నెలకొల్పేందుకు ఎంఓయూలు జరిగినట్లు చెప్పారు. జిల్లాలో ఇప్పటికే 5 పాయింట్ల ద్వారా ఉచిత ఇసుకను ఇస్తున్నామని, మరో 4 ఓపెన్ కాస్టు రీచ్‌లను గుర్తించామని, మరో 3 రీచ్‌ల అనుమతుల కోసం పంపినట్లు చెప్పారు.

జిల్లా కలెక్టర్ ప్రసంగంలో ముఖ్యాంశాలు..

- దారి తప్పిన పశువులకు నందనపల్లెలో రూ.50 లక్షలతో షెడ్డును ఏర్పాటు చేసేందుకు నిధులు వచ్చినట్లు జిల్లా కలెక్టర్ వివరించారు.
- జిల్లాలో ఉపాధి హామీ పథకంలో 99 లక్షల పని దినాలకు గాను ఇప్పటి వరకు 77 లక్షల పనిదినాలు కల్పించామన్నారు.
- నీతి ఆయోగ్ ర్యాంకుల్లో మద్దికెరకు 18, చిప్పగిరికి 36వ ర్యాంకు రాగా, ఆయా మండలాల అభివృద్ధికి రూ.2.5కోట్లను కేంద్రం కేటాయించినట్లు వివరించారు.
- ఓర్వకల్లు మండలం గుమ్మతం తండా వద్ద నిర్మితమవుతున్న పంప్ స్టోరేజ్ పవర్ ప్రాజెక్టుతో మార్చిలో 1,680 మెగా వాట్ల విద్యుత్ ఉత్పత్తి ప్రారంభం కానున్నదని చెప్పారు.
- గుండుతండా, హెబ్బటం వద్ద 1,500 మెగావాట్ల సామర్థ్యంతో పవన, చిప్పగిరి, హాలహర్వి, ఆలూరు ప్రాంతాల్లో 600 మెగా వాట్ల విద్యుత్ పవర్ ప్రాజెక్టులు మంజూరైనట్లు చెప్పారు.
- త్వరలో హెచ్‌ఎన్‌ఎస్‌ఎస్‌లో 40 టీఎంసీల నీటి కోసం విస్తరణ చేయనున్నట్లు చెప్పారు.

స్వాతంత్ర్య సమరయోధుల కుటుంబాలకు సన్మానం

స్వాతంత్ర్య పోరాటంలో పాలు పంచుకున్న జిల్లాకు చెందిన స్వాతంత్ర సమరయోధుల కుటుంబాలను జిల్లా కలెక్టర్ పి.రంజిత్‌బాషా, ఇన్‌చార్జ్ ఎస్పీ హుస్సేన్ పీరా సన్మానించారు. సన్మానం పొందిన వారిలో కర్నూలుకు చెందిన గుర్రం వెంకటరెడ్డి కుమారుడు గుర్రం జైపాల్‌రెడ్డి, కర్నూలుకు చెందిన సర్దార్ నాగప్ప కుమారుడు సర్దార్ బుచ్చిబాబు, జి.సత్యనారాయణ భార్య జి.సుబ్బమ్మ, ఎంసీ శుభకర్ భార్య ఎంసీ ఎంకమ్మ, ఎస్‌డీ నారాయణరావు కుమారుడు ఎస్‌డీ నాగేంద్ర ప్రసాదు, డి చెన్నయ్య కుమారుడు డి. రాధాకృష్ణమూర్తి, ఎస్ఎంకే బియాబానీ కుమారుడు ఎస్ఐబాషా బియబాని, తుక్కోజీరావు కుమారుడు కథం తుక్క చంద్రకాంత్, కల్నల్ ఐఎస్ సయిదా ఉన్నారు.

అలరించిన స్టాళ్లు

- సమగ్ర శిక్ష అభియాన్, విద్యాశాఖ శకటాలకు మొదటి బహుమతి వచ్చింది. రెండో బహుమతికి రెవెన్యూ, వ్యవసాయ, మూడో బహుమతికి డ్వామా, వైద్య ఆరోగ్య శాఖల శకటాలు ఎంపికయ్యాయి.



స్వాతంత్ర్య సమరయోధుల కుటుంబాలను సన్మానిస్తున్న కలెక్టర్ రంజిత్ బాషా

ఆసక్తి చూపని ప్రజాప్రతినిధులు

జిల్లాకు చెందిన ప్రజాప్రతినిధులు గణతంత్ర దినోత్సవంలో పాల్గొనేందుకు ఆసక్తి చూపనట్లు కనిపిస్తోంది. జెడ్పీ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి, కర్నూలు ఎంపీ బస్తిపాటి నాగరాజు మాత్రమే హాజరయ్యారు. మిగతా వారంతా డుమ్మా కొట్టారు. మంత్రి హోదాలో ఉన్న టీజీ భరత్, అధికార పార్టీ చెందిన ఎమ్మెల్యేలు హాజరు కాలేదు. కార్యక్రమంలో జేసీ డాక్టర్ బి.నవ్య, ఆదోని సబ్‌కలెక్టర్ మౌర్య భరద్వాజ్, అసిస్టెంట్ కలెక్టర్ చల్లా కల్యాణి తదితరులు పాల్గొన్నారు.



స్వాతంత్ర్య సంగ్రామం సన్నివేశ దృశ్యం



తెప్పలెల్లి పోయాక అంటూ.. విద్యార్థుల ప్రదర్శన

- మొత్తం 16 శాఖలు స్టాళ్లను ఏర్పాటు చేయగా అందులో ఏపీఎంఐపీ ఏర్పాటు చేసిన స్టాల్‌కు మొదటి స్థానం లభించింది. రెండో స్థానంలో ఉద్యాన శాఖ, మూడో స్థానంలో డీఆర్‌డీఏ -సెర్ప్ స్టాళ్లు నిలిచాయి.
- జిల్లాలోని పలు పాఠశాలలకు చెందిన విద్యార్థులు దేశభక్తిని పెంపొందించేలా సాంస్కృతిక కార్యక్రమాలు చేపట్టారు. వీరందరినీ కలెక్టర్, ఇన్‌చార్జ్ ఎస్పీలు అభినందించారు.



సాంస్కృతిక కార్యక్రమాలను తిలకిస్తున్న చిన్నారులు, వారి తల్లిదండ్రులు



మిట్టీ మే మిల్‌గయా అంటూ విద్యార్థుల ప్రదర్శన



ఆకట్టుకున్న విద్యార్థుల నృత్య ప్రదర్శన

పచ్చ కండువాలకు ప్రశంసాపత్రాలు

- సిఫార్సులకు తలొగ్గిన అధికారులు



పచ్చ కండువా వేసుకుని కలెక్టర్ చేతుల మీదుగా ప్రశంసా పత్రం అందుకుంటున్న హుస్సేనయ్య

కర్నూలు(సెంట్రల్): ప్రజాసేవ చేసిన వారికి ప్రభుత్వం స్వాతంత్ర్య, గణతంత్ర దినోత్సవాల్లో ఇచ్చే ప్రశంసా పత్రాల ప్రదానం లక్ష్యాన్ని అధికారులు నీరుగార్చారు. రాజకీయ ఒత్తిళ్లకు తలొగ్గినట్లు తెలుస్తోంది. ఆదివారం గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకొని పోలీసు పరేడ్ గ్రౌండ్‌లో కలెక్టర్ పి.రంజిత్‌బాషా, ఇన్‌చార్జ్ ఎస్పీ హుస్సేన్ పీరా ప్రదానం చేసిన ప్రశంసా పత్రాల జాబితాలో ఏకంగా ఎన్‌జీఓ పేరిట తెలుగుదేశం కోసం పాటు పడిన వారు కనిపించారు. ప్రజా రక్షణ సమితి కింద ప్రశంసా పత్రాన్ని అందుకున్న జే.హుస్సేనయ్య ఏకంగా పచ్చ కండువ వేసుకొని అందుకున్నారు. అంతేకాక టీడీపీ నాలుగోవార్డు ఇన్‌చార్జ్‌గా ఉన్న యూ.రమేష్ బాబు కూడా ప్రశంసా పత్రాన్ని అందుకున్నారు. ఇతను మంత్రి టీజీ భరత్‌కు ముఖ్య అనుచరుడు.

కొత్తగా బాధ్యతలు చేపట్టిన అధికారులకు కూడా..

ఉత్తమసేవలకు అందించే ప్రశంసా పత్రాల జాబితాలో చిత్ర విచిత్రాలు కనించాయి. రెండు వారాల క్రితం శ్రీశైలం ప్రాజెక్టు స్పెషల్ కలెక్టర్‌గా బాధ్యతలు చేపట్టిన టీకే వెంకటేశ్వర్లు, సీపీఓ ప్రభాకరరాజు సెలవులో ఉండడంతో ఆయన స్థానంలో ఇన్‌చార్జ్‌గా ఉన్న బి.భారతిలకు ప్రశంసా పత్రాలు వరించడంతో తీవ్ర చర్చ జరుగుతోంది. వీరి రెండు, మూడు నెలలు కూడా ఆ సీట్లలో పనిచేయకపోయినా వారి సేవలకు ప్రశంసలు రావడం దేనికి సంకేతమని కొందరు ప్రశ్నిస్తున్నారు. అలాగే ప్రైవేట్ స్కూలు అథెనాలో పనిచేస్తున్న మాస్టర్ కె.కౌశిక్‌రెడ్డికి ప్రశంసా పత్రాలు అందడంతో సిఫారసులకు వచ్చినట్లు పెద్ద ఎత్తున చర్చ సాగుతోంది. గతంలో సాంస్కృతిక కార్యక్రమాల్లో నృత్యాలకు మాత్రమే అనుమతి ఉండేది. అయితే ఈసారి మంత్రి టీజీ కుటుంబానికి దగ్గర ఉన్న కరాటే మాస్టర్ తన విద్యార్థులతో ప్రదర్శనకు అనుమతి ఇప్పించుకున్నారనే విమర్శలు ఉన్నాయి.



విజ్ఞాన బడిలో జ్ఞాపకాల జడి

వారంతా 1974, 1975, 1976లో పదో తరగతి పూర్తి చేసుకున్న విద్యార్థులు.. యాభై సంవత్సరాల తర్వాత తాము చదివిన కర్నూలు నెహ్రూ మెమోరియల్ మున్సిపల్ ఉన్నత పాఠశాలలో కలుసుకున్నారు. నేస్తమా.. కుశలమా అంటూ పలకరించుకుంటూ చిన్నప్పటి మధురానుభూతులను గుర్తు చేసుకుంటూ ఆనంద పరవశులయ్యారు. విద్యాబుద్ధులు చెప్పి తీర్చిదిద్దిన గురువులు పీజీ రామ్మూర్తి, సి.సుబ్బరాయుడు, నర్సిరెడ్డి, శివసుబ్రహ్మణ్యంను ఘనంగా సన్మానించారు. పూర్వ విద్యార్థుల సంఘం నాయకులు జి.వెంకటేశ్వర్లు, సుబ్బారావు, కిరణ్ కుమార్, ఆనంద్, దేవేంద్రగౌడ్, విలన్స్, సుధాకర్, శివాజీ, ప్రభాకర్, బాలకృష్ణారెడ్డి ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. – కర్నూలు కల్చరల్

పదవుల కోసం పైరవీలు!

- డీసీసీబీ ఛైర్మన్ పదవిపైనే ఆశలు
- రూ.కోటి వరకు ముడుపులు ఇచ్చేందుకు యత్నాలు
- పీఏసీఎస్‌ల్లో 297 మందికి రానున్న పదవులు
- మార్కెట్ కమిటీల్లో పాలక వర్గాల ఏర్పాటుకు చర్యలు



జిల్లా సహకార కేంద్రబ్యాంకు ప్రధాన కార్యాలయం

కర్నూలు(అగ్రికల్చర్): నామినేటెడ్ పదవుల కోసం టీడీపీ నాయకులు తీవ్రంగా పోటీ పడుతున్నారు. ఈ పదవులపై బీజేపీ, జనసేన నాయకులు కూడా ఆశలు పెట్టుకున్నారు. ఉమ్మడి కర్నూలు జిల్లా సహకార కేంద్రబ్యాంకు (డీసీసీబీ) చైర్మన్ పదవి కోసం టీడీపీ నాయకులు పైరవీ చేస్తున్నట్లు తెలుస్తోంది. అలాగే డీసీసీబీ పాలకవర్గం సభ్యులు కావాలని టీడీపీ, బీజేపీ, జనసేన నాయకులు ప్రయత్నిస్తున్నారు. ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘాలు, వ్యవసాయ మార్కెట్ కమిటీలు ఈ నెల చివరిలోపు పూర్తి కాకున్నాయి. ఈ నేపథ్యంలో 'బేర'రాయబారాలు ఊపందుకున్నాయి.

పీఏసీఎస్‌ల్లో 297 మందికి పదవులు

ఉమ్మడి కర్నూలు జిల్లాలో 99 ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘాలు (పీఏసీఎస్‌లు) ఉన్నాయి. నాన్ ఆఫీషియల్ పర్సన్ ఇన్‌చార్జ్ కమిటీలో ఒకరు చైర్మన్‌గా, ఇద్దరు సభ్యులుగా ఉంటారు. పీఏసీఎస్‌ల్లో 297 మంది పదవులు పొందే అవకాశం ఉంది. పదవులు ఇచ్చే అధికారం సంబంధిత ఎమ్మెల్యే, నియోజకవర్గం ఇన్‌చార్జీలకే ఉంటుంది. కొన్ని నియోజకవర్గాల్లో పీఏసీఎస్ చైర్మన్ పదవికి రూ.10 లక్షల వరకు డిమాండ్ చేస్తున్నట్లు సమాచారం. ఆదోని నియోజకవర్గంలో టీడీపీ, బీజేపీల మధ్య పోటీ ఉన్నట్లు తెలుస్తోంది.

మార్కెట్ కమిటీ చైర్మన్ కావాలని పోటాపోటీ

కర్నూలు జిల్లాలో 7, నంద్యాల జిల్లాలో 8 మార్కెట్ కమిటీలు ఉన్నాయి. ఇటీవలే మార్కెట్ కమిటీ చైర్మన్ పదవులకు ఆయా జిల్లా కలెక్టర్లు రిజర్వేషన్లు ఖరారు చేశారు. ప్రస్తుతం కర్నూలు, ఆదోని, నంద్యాల మార్కెట్ కమిటీలకు మార్కెటింగ్ శాఖ జాయింట్ డైరెక్టర్ రామాంజనేయులు, ఇతర మార్కెట్ కమిటీలకు మార్కెటింగ్ శాఖ ఏడీలు పర్సన్ ఇన్‌చార్జ్‌లుగా వ్యవహరిస్తున్నారు. మార్కెట్ కమిటీ చైర్మన్, వైస్ ఛైర్మన్, డైరెక్టర్ల ఎంపికలో నియోజకవర్గ ఎమ్మెల్యేలు, టీడీపీ ఇన్‌చార్జీలదే అధికారం. దీనిని అవకాశంగా తీసుకొని టీడీపీ నేతలు ముడుపులపై దృష్టి పెట్టినట్లు స్పష్టమవుతోంది. కర్నూలు, ఆదోని, ఎమ్మిగనూరు, నంద్యాల, ఆళ్లగడ్డ, నందికొట్కూరు మార్కెట్ కమిటీ చైర్మన్ పదవులకు పోటీ ఎక్కువగా ఉంది.

ఇదీ పరిస్థితి..

రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు ప్రస్తుతం ఉమ్మడి జిల్లా సహకార కేంద్రబ్యాంకుకు జాయింట్ కలెక్టర్ నవ్య, పీఏసీఎస్‌లకు సహకార శాఖ ఉద్యోగులు, వ్యవసాయ మార్కెట్ కమిటీలకు మార్కెటింగ్ శాఖ అధికారులు అఫీషియల్ పర్సన్ ఇన్‌చార్జ్‌లుగా కొనసాగుతున్నారు. నాన్ అఫీషియల్ పర్సన్ ఇన్‌చార్జ్ కమిటీల నియామకంపై ఆశావహులు మంత్రులు, జిల్లా ఇన్‌చార్జ్ మంత్రులపై ఒత్తిడి తెస్తున్నారు.

పైరవీలు ఇలా..

ఉమ్మడి కర్నూలు జిల్లా సహకార కేంద్ర బ్యాంకులో రూ.4,000 కోట్లకుపైగా టర్నోవర్ ఉంది. ఉమ్మడి కర్నూలు జిల్లాలోని 14 నియోజకవర్గాల నుంచి కేడీసీసీబీ చైర్మన్ పదవి కోసం పోటీ పడుతున్నారు. కొందరు రూ.కోటి వరకు ముడుపులు ముట్టచెప్పడానికి సిద్ధంగా ఉన్నట్లు తెలుస్తోంది. డబ్బులు తీసుకుని పదవి ఇస్తే బ్యాంకింగ్ వ్యవహారాల్లో అక్రమాలు వెల్లువెత్తే ప్రమాదం ఉంది. పత్తికొండ నియోజకవర్గం నుంచి సాంబశివారెడ్డి, డోన్ నియోజకవర్గం నుంచి సీమ సుధాకర్‌రెడ్డి, కర్నూలు నుంచి నాగరాజు, కోడుమూరు నుంచి పెరుగు పురుషోత్తమరెడ్డి, ఆదోని నుంచి మీనాక్షి నాయుడు, మంత్రాలయం నుంచి రాఘవేంద్రరెడ్డి, తిక్కారెడ్డి పోటీపడుతున్నారు. కేడీసీసీబీలో చైర్మన్‌గా ఒకరు, డైరెక్టర్లుగా ఉంటారు. ఉమ్మడి కర్నూలు జిల్లా సహకార మార్కెటింగ్ సొసైటీకి ఏడుగురుతో నాన్ అఫీషియల్ పర్సన్ ఇన్‌చార్జ్ కమిటీ ఏర్పాటు అవుతోంది. డీసీఎంఎస్ పదవులపై ఆసక్తి చూపే వారు తక్కువగా ఉన్నారు.

క్లుప్తంగా

రూ.2 వేలతో రూ.40 లక్షల ప్రమాద బీమా

కర్నూలు(అగ్రికల్చర్): భారతీయ స్టేట్‌బ్యాంకు వ్యక్తిగత ప్రమాద బీమా పథకాన్ని (పీఏఐ) మరింత విస్తరించింది. ఏడాదికి రూ.2000 ప్రీమియంతో రూ.40 లక్షల ప్రమాద బీమా కల్పిస్తూ ఇటీవల ఉత్తర్వులు జారీ చేసింది. ఈ పథకాన్ని పెద్ద ఎత్తున ప్రజల్లోకి తీసుకెళ్లనున్నట్లు ట్రెజరీ బ్రాంచ్ చీఫ్ మేనేజర్ సీవీఆర్ ప్రసాద్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రీమియం రూ.100కు రూ.2 లక్షలు మొదలుకుని గరిష్టంగా రూ.2 వేలకు రూ.40 లక్షల బీమా పొందవచ్చని వివరించారు. రోడ్డు ప్రమాదాలు, కరెంట్‌షాక్, వరదలు, భూకంపం, పాము, తేలు కాటు మరణాలకు బీమా వర్తిస్తుందని చెప్పారు. 18 నుంచి 70 ఏళ్ల వయసున్న వారెవరైనా బీమా చేయించుకోవచ్చని వెల్లడించారు.

ఏపీలో సినీ పరిశ్రమ ఏర్పాటు చేయాలి



మాట్లాడుతున్న టీజీ వెంకటేష్

కర్నూలు కల్చరల్: కళలకు పుట్టినిల్లు రాయలసీమ అని, సినిమాలకు ఎక్కువగా ఫైనాన్స్ చేస్తున్నది ఇక్కడి వాసులేనని ఏపీ ఫిల్మ్ ఛాంబర్ ఆఫ్ కామర్స్ వ్యవస్థాపక చైర్మన్ టీజీ వెంకటేష్ అన్నారు. ఆదివారం కర్నూలు నగరంలోని పరిణయ ఫంక్షన్ హాల్‌లో జరిగిన సమావేశంలో ఏపీ ఫిల్మ్ ఛాంబర్ ఆఫ్ కామర్స్ సంస్థను స్థాపించారు. ఈ సందర్భంగా టీజీ మాట్లాడుతూ.. కళలకు రాయలసీమ పుట్టినిల్లు అయినప్పటికీ సినిమా నిర్మాణం, చిత్రీకరణ ఇక్కడ జరగడం లేదన్నారు. ఎంతో ప్రాముఖ్యత ఉన్న ఈ ప్రాంతంలో సినిమా నిర్మాణం జరగకపోవడం బాధాకరమన్నారు. రాష్ట్రం విడిపోయాక సినీ పరిశ్రమ హైదరాబాద్‌లో ఉండిపోయిందన్నారు. ఇక్కడి వారిని ప్రోత్సహించేలా సినీ పరిశ్రమను ఏపీలో ఏర్పాటు చేయాలనే డిమాండ్‌తో ఏపీ ఫిల్మ్ ఛాంబర్ ఆఫ్ కామర్స్ ఏర్పాటు చేసినట్లు చెప్పారు. అసోసియేషన్ ప్రతినిధులు బీవీ రెడ్డి, కేజే రెడ్డి, కేవీ సుబ్బారెడ్డి, పత్తి ఓబులయ్య, దాసెట్టి శ్రీనివాసులు, మమ్మద్ మియ్యా పాల్గొన్నారు.

చిన్నారిని గుర్తించి తీసుకెళ్లండి



బాలిక పవిత్ర

పత్తికొండ రూరల్: ఈ చిత్రంలో ఉన్న చిన్నారి తప్పిపోయి తమ వద్దకు చేరిందని, తల్లిదండ్రులు, బంధువులు వచ్చి తీసుకెళ్లవచ్చని పత్తికొండ సీఐ జయన్న తెలిపారు. ఆదివారం మండల పరిధిలోని పందికోన గ్రామంలో చర్చి వద్ద గుర్తు తెలియని పవిత్ర అనే బాలిక తిరుగుతుంది. గ్రామస్తులు గుర్తించి ఆరా తీయగా తన పేరు పవిత్ర అని చెప్పింది. తల్లిదండ్రుల పేర్లు, ఊరి పేరు చెప్పలేకపోతోంది. దీంతో పోలీసులకు సమాచారం ఇవ్వడంతో వారు అక్కడికి చేరుకుని బాలికను గ్రామపెద్దల సంరక్షణలో ఉంచారు. తల్లిదండ్రులు, బంధువులు ఉంటే పోలీసు స్టేషన్‌ను సంప్రదించి బాలికను తీసుకెళ్లాలని కోరారు.

భారత ఫుట్‌బాల్ జట్టు సెలెక్టర్‌గా కర్నూలు వాసి



షేక్ ఖలీల్ రెహమాన్

కర్నూలు (టౌన్): కర్నూలు నగరంలోని పాతబస్తీకి చెందిన సీనియర్ ఫుట్‌బాల్ క్రీడాకారుడు, 6 సార్లు సంతోష్ ట్రోఫీ జట్టుకు ప్రాతినిధ్యం వహించిన షేక్ ఖలీల్ రెహమాన్‌కు అరుదైన గౌరవం దక్కింది. ఆల్ ఇండియా ఫుట్‌బాల్ ఫెడరేషన్ అండర్- 17 యూత్ లీగ్ చాంపియన్‌షిప్ పోటీల్లో పాల్గొనే ఇండియన్ టీమ్‌కు సెలెక్టర్‌గా ఆయన ఎంపికయ్యారు. ఈ మేరకు ఆలిండియా ఫుట్‌బాల్ ఫెడరేషన్ ప్రధాన కార్యదర్శి పి.అనిల్‌కుమార్ శనివారం రాత్రి ఉత్తర్వులు జారీ చేశారు. న్యూఢిల్లీ వేదికగా జరిగే అండర్-17 యూత్ లీగ్ పోటీల్లో జట్టును ఎంపిక చేసే బాధ్యతలు ఆయనకు అప్పగించారు. ఈ నెల 28 నుంచి 30వ తేదీ వరకు ఆల్ ఇండియా జట్టు ప్రాబబుల్స్ నిర్వహించనున్నారు.

ఉత్తమ సేవలకు ప్రశంసలు



మౌర్య భరద్వాజ్ సబ్ కలెక్టర్, ఆదోని | వెంకటేశ్వర్లు స్పెషల్ కలెక్టర్, శ్రీశైలం ప్రాజెక్టు | సందీప్‌కుమార్ ఆర్‌డీఓ, కర్నూలు | భరత్ నాయక్ ఆర్‌డీఓ, పత్తికొండ | నాగరాజు ఏడీ, హ్యాండ్లూమ్ | జయమ్మ, డీడీ, ఐఅండ్‌పీఆర్ | రవిచంద్, డీడీ, మైన్స్ | రమేష్ బాబు, డిస్ట్రిక్ట్ ఆడిట్ ఆఫీసర్ | ఆనంద్ రాజ్‌కుమార్, నైపుణ్యాభివృద్ధి అధికారి | శామ్యూల్ పాల్, డీఈఓ | నాగసుధ, డీఎం, సివిల్ సప్లయ్స్



జిల్లాలో ఉత్తమ సేవలు అందించిన ఉద్యోగులకు గణతంత్ర దినోత్సవం సందర్భంగా ప్రశంసా పత్రాలు అందజేశారు. ఆదివారం పోలీసు పరేడ్ మైదానంలో నిర్వహించిన కార్యక్రమంలో కర్నూలు మున్సిపల్ కమిషనర్ రవీంద్రబాబుకు ప్రశంసాపత్రం అందజేస్తున్న కలెక్టర్ రంజిత్ బాషా, ఇన్‌చార్జ్ ఎస్పీ హుసేన్ పీరా, జేసీ నవ్య, అసిస్టెంట్ కలెక్టర్ చల్లా కళ్యాణి. - సాక్షి ఫొటోగ్రాఫర్, కర్నూలు



శాంతకుమారి, డీటీసీ | కె.తులసి దేవి, డీటీడబ్ల్యూఓ | డి.అనుపమ, డీపీఎం | డి.కిషోర్‌రెడ్డి, ఈఈ, పీసీబీ | లక్ష్మీనారాయణ, ఈఈ, ఏపీఈడబ్ల్యూఐడీసీ | పి.శ్యామల, డిస్ట్రిక్ట్ ఫారెస్ట్ ఆఫీసర్ | వెంకటరామయ్య, పీడీ, డ్వామా



వి.రామచంద్రారెడ్డి, పీఆర్ ఎస్ఈ | మహేశ్వరరెడ్డి, ఎస్ఈ, ఆర్అండ్‌బీ | శ్రీదేవి, డిస్ట్రిక్ట్ కోఆర్డినేటర్ ఫర్ రెసిడెన్షియల్ స్కూల్స్ | వెంకటేశ్వర్లు, సూపరింటెండెంట్, జీజీహెచ్ | ఎల్.భాస్కర్ టీబీ ఆఫీసర్ | భారతి సీపీఓ | భూపతి రావు డీఎస్‌డీఓ



విజయశ్రీ, ఏఓ, కలెక్టరేట్ | వేణుగోపాల్, సూపరింటెండెంట్, కలెక్టరేట్ | వెంకటేశ్వర్లు, సూపరింటెండెంట్ కలెక్టర్ ఆఫీస్ | రాజా రవీంద్రనాథ్, డిప్యూటీ తహసీల్దార్ | శ్రీనాథ్, డిప్యూటీ తహసీల్దార్ | తిరుమల నాయుడు రికార్డ్ అసిస్టెంట్ | ప్రీతమ్ కుమార్ కలెక్టర్ సీసీ | వలీ బాషా కలెక్టర్ సీసీ | ఈరన్న డేటా ఎంట్రీ ఆపరేటర్ | వేణుగోపాల్ పీఎస్‌ఓ | బజారి డ్రైవర్



వెంకోబా కలెక్టర్ డ్రైవర్ | వడ్డె మోహన్ ఫొటోగ్రాఫర్, కలెక్టర్ | వెంకటరాజు, సీసీ, జాయింట్ కలెక్టర్ | లక్ష్మణ్ నాయక్, దఫేదార్, జాయింట్ కలెక్టర్ | నూర్ బాషా, దఫేదార్, జాయింట్ కలెక్టర్ | సుధాకర్ రావు, దఫేదార్, డీఆర్వో | దేవకాంత్, ఫొటోగ్రాఫర్, ఐఅండ్‌పీఆర్ | ఆంజనేయులు, తహసీల్దార్, కల్లూరు | వేణుగోపాల్‌రావు, ఏఓ, ఆర్‌డీఓ ఆఫీస్ | రామాంజనేయులు, డీటీ, కోడుమూరు | శివరాముడు, ఆదోని తహసీల్దార్



చంద్రకళ, డిప్యూటీ తహసీల్దార్ | బాబుప్రసాద్, డీఎస్పీ, కర్నూలు | వెంకటరామయ్య, డీఎస్పీ, పత్తికొండ | కేశవరెడ్డి, సీఐ, కర్నూలు | నాగరాజరావు, సీఐ, కర్నూలు టూటౌన్ | చంద్రబాబు నాయుడు, సీఐ, తాలూకా స్టేషన్ | తేజోకుమార్, జూనియర్ అసిస్టెంట్, డీపీఓ ఆఫీస్ | చంద్రశేఖర్ రెడ్డి, ఎస్ఐ, ఫోర్త్ టౌన్ | శ్రీనివాసులు, ఎస్ఐ ఎమ్మిగనూరు | జి.అశోక్, ఎస్ఐ, వెల్దుర్తి | ఎం.కె.నాగభూషణం, డీసీఆర్‌బీ



సర్దార్ బాషా, హెడ్ కానిస్టేబుల్ | మహబూబ్ బాషా, అసిస్టెంట్ కమాండెంట్ | సుధారాణి, జూనియర్ అసిస్టెంట్ | జి.స్వప్న, వీపీఏ, గ్రేడ్-2 | నారాయణ, మెసెంజర్, ఏడీఏ, కర్నూలు | కేశవయ్య, లైన్ ఇన్‌స్పెక్టర్, కర్నూలు | గంగన్న, డిప్యూటీ స్టాటికల్ ఆఫీసర్, సీపీఓ ఆఫీస్ | జయలక్ష్మి, మార్కెట్ యార్డు సెక్రటరీ, కర్నూలు | నాగరాజు, డ్రైవర్, కలెక్టర్ ఆఫీస్ | విజయలక్ష్మి, ఈఓ, పీఆర్ అండ్ ఆర్‌డీ | కె.సురేఖ, వెటర్నరీ అసిస్టెంట్ సర్జన్



రామాంజనేయ రెడ్డి, ఏఎస్‌ఓ, సివిల్ సప్లయ్స్ | రామచంద్రమూర్తి, సీనియర్ అసిస్టెంట్, జెడ్పీ | వినితాబాయ్, జూనియర్ అసిస్టెంట్, జెడ్పీ | లచ్చన్న, ఆఫీస్ సబార్డినేట్ | ఎంఎస్‌పీ తేజశ్విని, ఫారెస్ట్ రేంజర్ | ఓంకార్ యాదవ్, ఎంఈఓ | కె.లోకేష్‌రెడ్డి, అథెనా స్కూల్ | లాలెప్ప, ప్రిన్సిపాల్, గవర్నమెంట్ జూనియర్ కాలేజ్ | మెహరాజ్, సీనియర్ అసిస్టెంట్ | బి.ప్రతాప్, ఏపీఓ | కె.రామ్‌నాథ్, సూపర్‌వైజర్



రత్నరూత్, జిల్లా సైనిక్ వెల్ఫేర్ ఆఫీసర్ | జాఫ్రిన్, డిప్యూటీ రిజిస్ట్రార్, కర్నూలు | ఎం.బేబీ, జూనియర్ అసిస్టెంట్ | గౌస్ పీరా, అసిస్టెంట్ కమిషనర్, ఆదోని | షరీఫ్, అకౌంట్స్ ఆఫీసర్, డీఆర్‌డీఏ | ఎన్.ప్రసాద్, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ | స్వర్ణలత, ఫిషరీస్ డిపార్ట్‌మెంట్ | సౌమ్యశ్రీ, మైక్రో డిపార్ట్‌మెంట్ | మంజులాబాయి, హెచ్‌ఓడీ, ప్లాస్టిక్ సర్జరీ | విశాల, హెచ్‌ఓడీ, అనస్థీషియా | డాక్టర్ శ్రీలక్ష్మి, హెచ్‌డీఓ, గైనకాలజీ



బి.మధునాయక్, అసిస్టెంట్ ప్రొఫెసర్ | గంగపల్లి వందన, అసిస్టెంట్ ప్రొఫెసర్ | సి.శ్రీనివాసులు, హెచ్‌ఓడీ, న్యూరాలజీ | శ్రీలత, గవర్నమెంట్ జనరల్ హాస్పిటల్ | మల్లికార్జున రెడ్డి, న్యూక్లియస్ మెడికల్ ఆఫీసర్ | అలీ బాషా, సూపరింటెండెంట్ సోషల్ వెల్ఫేర్ | రజని, సీనియర్ అసిస్టెంట్, డిస్ట్రిక్ట్ రిజిస్ట్రేషన్ ఆఫీస్ | ప్రత్యూష, సబ్ రిజిస్ట్రార్, కోడుమూరు | మగ్బూల్ బాషా, సీనియర్ అసిస్టెంట్ | నాగరాజ నాయక్, ఎంవీఐ | రామకృష్ణ, సబ్ ఇన్‌స్పెక్టర్



రెహానా బేగం, సబ్ ఇన్‌స్పెక్టర్, ఎక్సైజ్ | శ్రీకాంత్, ఐఅండ్‌పీఆర్ | వీరభద్రుడు, ఆఫీస్ సబార్డినేట్, ఐఅండ్‌పీఆర్ | శ్రీనివాసరెడ్డి, జూనియర్ అసిస్టెంట్, కన్స్యూమర్ కోర్టు | హురుల్లా అమీన్, టైపిస్ట్, కన్స్యూమర్ కోర్టు | శ్రీనివాసులు, అసిస్టెంట్ కమాండెంట్ | కె.ప్రకాష్, సెక్రటరీ, జిల్లా గ్రంథాలయం | మగ్బూల్ బాషా, సీనియర్ అసిస్టెంట్, గ్రంథాలయం | విజయలక్ష్మి, మేనేజర్, గూడూరు నగర పంచాయతీ | జి.మంజునాథ్, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ | వై.రాజు, ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ కమిటీ మెంబర్ | మధుసూదన్, డీఎంహెచ్‌ఓ ఆఫీస్



ఆకట్టుకున్న శకటాలు

ప్రథమ స్థానంలో సమగ్ర శిక్ష అభియాన్ విద్యా శాఖ శకటం





ద్వితీయ స్థానం సాధించిన రెవెన్యూ, వ్యవసాయ శాఖ శకటాలు





తృతీయ స్థానంలో నిలిచిన డ్వామా, వైద్య ఆరోగ్య శాఖ శకటాలు

జీసీజీటీఏ నూతన జిల్లా అధ్యక్షుడిగా వెంకటస్వామి



ప్రమాణ స్వీకారం చేస్తున్న జీసీజీటీఏ నూతన కమిటీ సభ్యులు

కర్నూలు కల్చరల్: గవర్నమెంట్ కాలేజ్ గజిటెడ్ టీచర్స్ అసోసియేషన్ (జీసీజీటీఏ) నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఆదివారం స్థానిక కార్యాలయంలో జరిగిన సమావేశంలో నూతన కమిటీ ఎన్నిక జరిగింది. ఎన్నికల పరిశీలకులుగా కల్యాణదుర్గం ప్రభుత్వ డిగ్రీ కళాశాల అధ్యాపకులు డాక్టర్ ఎం.వి. శేషయ్య వ్యవహరించారు. నూతన అధ్యక్షుడిగా కర్నూలు పురుషుల ప్రభుత్వ డిగ్రీ కళాశాల చరిత్ర అధ్యాపకులు డాక్టర్ ఎ.వెంకటస్వామి, కార్యదర్శిగా సిల్వర్ జూబ్లీ ప్రభుత్వ డిగ్రీ కళాశాల భౌతిక శాస్త్ర అధ్యాపకులు డాక్టర్ మహమ్మద్ వాయిజ్, ఉపాధ్యక్షులుగా కేవీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల రాజనీతి శాస్త్ర అధ్యాపకులు డాక్టర్ ఎం.సి. సాహిత్య, కోశాధికారిగా సిల్వర్ జూబ్లీ ప్రభుత్వ డిగ్రీ కళాశాల చరిత్ర అధ్యాపకులు డాక్టర్ నాగన్న, సంయుక్త కార్యదర్శిగా పురుషుల ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆర్థిక శాస్త్ర అధ్యాపకులు డాక్టర్ టి.మాదన్నను ఎంపిక చేశారు.